క్లుప్తంగా

ముగిసిన సత్యదేవుని బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: రవీంద్రనగర్‌లోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా ఉదయం విశేష అర్చనలు, నిత్య హోమం, శ్రీ సూక్త హోమం, వసంతోత్సవం, శ్రీ చక్రస్నానము, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణాలు, పవళింపుసేవ తదితర పూజా కార్యక్రమాలలో భక్తులు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ, కామేశ్వరరావు పర్యవేక్షించారు.

వెటరన్ క్రీడాకారుల అద్భుత ప్రదర్శన



గుంటూరు వెస్ట్ (క్రీడలు): వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈ నెల 2 నుంచి 5 వరకు జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారని జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు రాయపాటి రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి మొత్తం 15 మంది పాల్గొనగా అందులో 5 పతకాలు సాధించారన్నారు. వీరిలో పతకాలు సాధించిన వారు త్వరలో గోవాలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఏఎన్‌యూ పరిశోధకుడికి డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(హెచ్‌ఆర్‌ఎం) పరిశోధకుడు పెండెం చంద్రబాబుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ డాక్టర్ కె.సోమశేఖర్ తెలిపారు. హెచ్‌ఆర్‌ఎం పరిశోధనా పర్యవేక్షకుడు డాక్టర్ బి.నాగరాజు పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ హెచ్‌ఆర్ ఇన్ ఎంప్లాయి ఎంప్లాయిమెంట్ ఇన్ సెలెక్ట్ హెల్త్ కేర్ యూనిట్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు చెప్పారు. చంద్రబాబు గత పది సంవత్సరాలుగా విజయవాడలోని ఆయుష్ ఆస్పత్రిలో హెల్త్ సెక్టార్‌లో పనిచేస్తున్నారు. డాక్టరేట్ అందుకున్న చంద్రబాబుకు ఆయుష్ ఆస్పత్రి యాజమాన్యం, సిబ్బంది అభినందనలు తెలిపారు. తాను డాక్టరేట్ చేయడానికి అవసరమైన సమాచారం, సహకారాన్ని ఆ యుష్ ఆస్పత్రి చైర్మన్ యార్లగడ్డ రమేష్‌బాబు అందించారని చంద్రబాబు పేర్కొన్నారు.

స్టెప్‌కాన్‌లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను అందించి వారిని ఉన్నత స్థానాలకు చేర్చటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టెప్‌కాన్ 2023 జాతీయ స్థాయి సదస్సులో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ఓవరాల్ చాంపియన్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలోని జీఎమ్మార్ ఐటీ కళాశాలలో నిర్వహించిన స్టెప్‌కాన్ జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీలలో ప్రాజెక్ట్ డిజైన్ పరిశోధన పత్రాలను పేపర్ ప్రజంటేషన్ ద్వారా తమ విద్యార్థులు వివరించారని పేర్కొన్నారు. అదేవిధంగా తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన గోకాట్ వాహనానికి ఓవరాల్ చాంపియన్‌షిప్ లభించిందన్నారు. చాంపియన్‌షిప్‌తోపాటు రూ.20 వేల బహుమతిని అందజేశారన్నారు. చాంపియన్ షిప్ సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

చేబ్రోలు: రెవెన్యూ సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని ట్రైనింగ్ స్పెషల్ కలెక్టర్ శివన్నారాయణశర్మ అన్నారు. చేబ్రోలు తహసీల్దారు కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. చేబ్రోలు తహసీల్దారు కె.సుజాత ప్రస్తుతం సెలవులో ఉన్నారు. 15 రోజుల పాటు ట్రైనింగ్ నిమిత్తం ఇక్కడకు వచ్చారు. 15 రోజుల పాటు తహసీల్దారు కార్యాలయంలో ఆయన అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా రికార్డు రూంను పరిశీలించారు. డెప్యూటీ తహసీల్దారు, ఆర్ఐలతో పెండింగ్ రెవెన్యూ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

గడువులోగా స్పందించండి

- స్పందన ఫిర్యాదులపై సిబ్బందికి కమిషనర్ దిశా నిర్దేశం
- 56 ఫిర్యాదులు రాక



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. తొలుత సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతూ జాబు చాట్ ప్రకారం ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అడ్మిన్ కార్యదర్శులు ఆస్తి, ఖాళీ స్థల పన్నులను నూరు శాతం వసులు చేయాలని, ప్లానింగ్ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ రీసర్వే పూర్తి చేయాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు సచివాలయం పరిధిలో బకాయిలున్న మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులను వసులు చేయాలన్నారు. శానిటేషన్ కార్యదర్శులు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా బహిరంగ మల, మూత్ర విసర్జన జరగకుండా ప్రజలలో అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు. ఏఎన్ఎంలు ఆయుష్మాన్ భారత్ సర్వే వేగంగా పూర్తి చేయాలని, ఎమినిటి సెక్రటరీలు ప్రతి రోజు 10 త్రాగునీటి శాంపిల్స్ తీయాలని ఆదేశించారు. అనంతరం గతవారం స్పందన ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలన్నారు. నోడల్ అధికారులు సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలపై పర్యవేక్షణ చేయాలని, ప్రతి సోమవారం నోడల్ అధికారులతో సచివాలయ పనితీరుపై సమీక్షా చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులందరూ సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 56 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 16, ఇంజినీరింగ్ విభాగానికి 19, ప్రజారోగ్య విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 4, ఉపా సెల్ విభాగానికి సంబధించి 4, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 7 చొప్పున ఫిర్యాదులు వచ్చాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, డెప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, సీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఏసీపీలు, ఆర్ఓలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరిండెంట్లు పాల్గొన్నారు.

ఏఆర్టీ కేంద్రాల్లో హెపటైటిస్ బీ టీకా

- జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ భూక్యా లక్ష్మనాయక్
- ఉచితంగా హెపటైటిస్ బీ వ్యాక్సిన్



హెపటైటీస్ బీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: హెపటైటిస్ బీ వైరస్ టీకాను అన్ని ఏఆర్టీ కేంద్రాల్లో సోమవారం నుంచి ఉచితంగా అందించడం జరుగుతోందని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ భూక్యా లక్ష్మనాయక్ అన్నారు. హెచ్ఐవీ, హై రిస్క్ గ్రూపుల వారికి హెపటైటిస్ బీ సోకే అవకాశం ఎక్కువగా ఉందని హెపటైటిస్ బీ టీకాలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా రక్షణ పొంద వచ్చన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ఎ.ఆర్.టి ప్లస్ సెంటర్‌లో సోమవారం హెపటైటిస్ బీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఏ ఆర్ టి ప్లస్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎస్.ఉషా రాణి, డాక్టర్ భూక్యా లక్ష్మ నాయక్ ప్రారంభించారు. అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ హెపటైటిస్ బీ ఒక కాలేయ సంబంధిత వ్యాధి అని, హెపటైటిస్ బీ సోకిన వ్యక్తి రక్తం, వీర్యం ఇతర శరీర ద్రవాల ద్వారా ఇతరులకు సోకుతుందన్నారు. ఇది అసురక్షితమైన లైంగిక సంపర్కం, సూదులు, సిరంజిలు పంచుకోవడం, తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. హెపటైటిస్‌బీ తో బాధపడుతున్న చాలా మందికి ఈ వ్యాధి లక్షణాలు తెలియదని, వైరస్ సోకినట్టు గ్రహించలేరని ఏ ఆర్ టి ప్లస్ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తమలపాకుల ప్రభాకరరావు వెల్లడించారు. జ్వరం, అలసట, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, కడుపునొప్పి, మూత్రం రంగుమారడం, కామెర్లు, తదితర లక్షణాలు ఉంటాయన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ లంకపల్లి మధుసూధనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెపటైటిస్ బీ నిర్ధారణ పరీక్ష చేయించుకుని వ్యాక్సిన్ తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ఎ.ఆర్.టి కేంద్రాల్లో హెపటైటిస్ బీ పరీక్ష, వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తున్నట్టు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ మూడు డోసులు క్రమం తప్పకుండా తీసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 16 వేల మందికి వ్యాక్సిన్లు వేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ కే రత్న కుమార్, ఏ ఆర్ టి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ లక్ష్మి రవి శంకర్, డాక్టర్ ఆర్ రమ్య, కౌన్సిలర్లు ఆర్ నందిప్, స్వర్ణ లలిత, స్టాఫ్ నర్సులు ఎ.ఆర్.టి సిబ్బంది స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్లలో..

హెచ్.ఐ.వి బాధితులకు ఉచితంగా హెపటైటిస్ బీ వ్యాక్సిన్‌ను గుంటూరు రూరల్ మండలం గోరంట్ల ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల హాస్పటల్ ఏఆర్టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెన్నెల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెపటైటిస్ బి వైరస్ కి టీకా (వ్యాక్సిన్‌)ను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఎ.ఆర్.టి కేంద్రాల్లో సోమవారం నుంచి ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. భారతదేశంలో 40 మిలియన్ల మంది హెపటైటిస్‌బీతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. హెపటైటిస్ వైరస్ ఉన్నవారిలో 90 శాతం మందికి సరైన చికిత్సతో పూర్తిగా నయం అవుతున్నట్టు వెల్లడించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరిత, ఏఆర్‌టీ కౌన్సిలర్‌లు కోటిరత్నం, సౌజన్య, భాగ్యలక్ష్మీ, స్టాఫ్ నర్స్ లోకేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ ఆనందబాబు డేటా మేనేజర్లు జ్యోతి, రేవతి, కేర్ కోఆర్డినేటర్ గీత, షేర్ ఇండియా సువర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవ్వుతో అదుపులో షుగర్ వ్యాధి



మాట్లాడుతున్న డాక్టర్ వీవీ రామ్‌కుమార్

గుంటూరు మెడికల్: ప్రతిరోజూ హాయిగా నవ్వటం వల్ల శరీరంలోని ఒత్తిడి (స్ట్రెస్) హార్మోన్స్ తగ్గి రక్తంలో షుగర్ అదుపులో ఉండటానికి అవకాశాలు ఉన్నాయని, పరిశోధనలో తేలిందని గుంటూరు ఎస్.వి.ఆర్. డయాబెటిస్ సెంటర్‌కు చెందిన సీనియర్ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వీవీ రామ్‌కుమార్ అన్నారు. చెన్నై ఐటీసీ గ్రాండ్‌చోళాలో (ఫిబ్రవరి 4, 5 తేదీలు) శనివారం, ఆదివారం సైంటిఫిక్ ప్రోగ్రామ్ డిబేట్ 2023 సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ నవ్వటం వల్ల అధిక రక్తపోటు, గుండె జబ్బులను, కిడ్నీ వ్యాధులను నివారించవచ్చని పరిశోధనలో తేలిందన్నారు. లాఫ్టర్ యోగా చేయటం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తగ్గటంతోపాటు శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వెల్లడించారు. షుగర్ వ్యాధి చికిత్సలో నవ్వును ఎలా ఉపయోగించాలి, లాఫ్టర్ థెరపీ గురించి సదస్సులో డాక్టర్ రామ్‌కుమార్ వివరించారు.

నేడు ఉరుసు మహోత్సవం

లక్ష్మీపురం: స్థానిక తూర్పు నియోజక వర్గ పరిధిలోని చిన్నబజార్ సెంటర్‌లోని చిన్న మౌలా పంజా ఆషుర్ ఖానాలో హాజరత్ సయ్యద్ షా ఔలియా, హజరత్ సిద్ది బాబా సిద్ధిక్ అమ్మాజన్ వారి దర్గాలో ఉరుసు వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయని దర్గా ముతవల్లి ఖాదర్ బాబా సోమవారం వెల్లడించారు. ఉరుసు వేడుకల్లో మొదటి రోజు ఈనెల 7వ తేదీన మంగళవారం గంధం, 8న బుధవారం దీపారాధన, 9వ తేదీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాబా ఉరుసు మహోత్సవాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రతి ఏటా పండుగ వాతావరణంలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: మైనర్‌బాలికతో అపార్టుమెంట్ వాచ్‌మెన్ అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. నవభారత్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్ వాచ్‌మెన్ రఘు అపార్టుమెంట్ సమీపంలోని ఓ కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక వాచ్‌మెన్ ప్రవర్తనను తల్లిదండ్రులకు చెప్పడంతో వారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జాబ్‌మేళా

కాకుమాను: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ కల్పన, సీడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో వివిధ ప్రైవేట్ సంస్థల్లో పని చేయుటకు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాబ్స్ రీసోర్స్ పర్సన్ వీరాస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లోని సీడాప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 7286962778 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సినిమాలలో ఉత్తమ సంస్కారాన్ని చూపారు



కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు, కార్యదర్శి కొండాశివరామిరెడ్డి

లక్ష్మీపురం: అయిదున్నర దశాబ్దాలకు పైగా తన సృజన శక్తితో వెండి తెరపై అనేకానేక విలక్షణ దృశ్య కావ్యాలను సృష్టించి ప్రేక్షకలోకాన్ని మంత్రముగ్ధుల్ని చేసి వారిలో ఉత్తమ సంస్కారాన్ని ప్రేరేపించిన కళా తపస్వీ కె.విశ్వనాథ్ అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి.రామ్‌కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కె.విశ్వనాథ్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాత్మకతతోనూ కాసుల పంట సాధ్యమేనని తన సినిమాల ద్వారా నిరూపించిన దర్శకుడు విశ్వనాథ్ అని అన్నారు. చలన చిత్ర సృజన వైభవాన్ని ఆత్మగౌరవంతో ఆరంభించారన్నారు. వెండి తెరపై చెరగని తెలుగు సంతకం గుండెపొరల్లో చెదరని తీపి జ్ఞాపకం కె.విశ్వనాథ్ అని అన్నారు. అనంతరం సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరుల నివాళులర్పించారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని ద్రోహం

అవగాహన సంస్థ సమావేశంలో వక్తల విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న విద్యావేత్త బి.సి హెచ్ అనంతరామయియ్య

లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి తీరని ద్రోహం జరిగిందని, ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టు కేటాయించలేదని విద్యావేత్త బి.సి.హెచ్. అనంతరామయ్య అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బడ్జెట్ సమావేశంపై సోమవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన బడ్జెట్‌లో ప్రత్యేక హోదా, వెనుకబడ్డ జిల్లాల ప్యాకేజీల ప్రస్తావనే రాలేదన్నారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్ళయినా రాష్ట్ర విభజన చట్టంలో రాష్ట్రానికి పేర్కొన్న అనేక హామీలను ఈ బడ్జెట్‌లో పేర్కొనలేదన్నారు. కేంద్ర విద్యా సంస్థలకు గతేడాది కేటాయించిన నిధుల్లో కూడా తగ్గించారని విమర్శించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్లేషకులు ఎన్.సదాశివం మాట్లాడుతూ పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు కేంద్ర బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేసి పక్కనున్న ఆంధ్రప్రదేశ్ పై వివక్షత చూపించటం దారుణమన్నారు. పోలవరం అమరావతి నిర్మాణానికి నిర్ణయాలు, విశాఖ ఉక్కుపైనా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావనలేదన్నారు. పోలవరానికి 2023–24 బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని త్వరలో ఎన్నికలు జరుగునున్న కర్ణాటకలోని అప్పర్‌భద్ర నీటి ప్రాజెక్టుకు మాత్రం బడ్జెట్ ఏకంగా రూ.5300 కోట్లు కేటాయించారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు వెంకటరత్నం, గుప్తా, మురళీకృష్ణ, సుబ్బారెడ్డి, ప్రసంగించారు.

ఫార్మసీ పట్టభద్రులు వ్యవస్థాపకులుగా ఎదగాలి

హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు



జూపూడి రంగరాజును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నాగభూషణం, అధ్యాపకులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ పట్టభద్రులు వ్యవస్థాపకులుగా ఎదగాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం బి.ఫార్మసీ, ఫార్మా.డి, డి.ఫార్మసీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో ముందుగా ప్రముఖ దర్శకుడు కళా తపస్వి కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఉద్యోగాల కోసం అన్వేషించకుండా ఔషధ సంస్థలను స్థాపించి, ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ కళాశాలలో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని తాము నిర్దేశించుకున్న గమ్యానికి చేరుకోవాలని సూచించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా సీనియర్ విద్యార్థులు తమ జూనియర్లకు నిర్వహించిన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జూపూడి రంగరాజును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ సహాయం అందించడానికి కృషి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నకుమార్

గుంటూరు లీగల్: సమస్యలు ఎదురైనప్పుడు న్యాయ సహాయం అందించి వారికి అండగా నిలిచేందుకు న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు కృషి చేస్తున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నకుమార్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సోమవారం ఇంటర్నేషనల్ జస్టిస్ ఇండియా వారితో కలిసి మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బంధంపై ఒకరోజు వర్క్‌షాప్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. కె.రత్నకుమార్ మాట్లాడుతూ వన్ స్టాప్ క్రైసిస్ బృందాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బాధితులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ తరపున విలియమ్ క్రిస్టఫర్ మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బంధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రేస్ క్రిస్టెఫర్, ఐజెఎం సభ్యులు, పలువురు న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకంపై బంధువుల నిరసన

- వేధింపుల వల్లే మృతిచెందాడంటూ మృతుడి బంధువుల ఆందోళన
- ఆర్థిక నేరం మోపి మనస్తాపానికి గురిచేశారంటూ వెల్లడి
- మృతుడు అరండల్‌పేట 6వలైనులోని ఓ ఆసుపత్రిలో గుమాస్తా



మృతదేహంతో ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

గుంటూరు ఈస్ట్: ప్రైవేటు ఆసుపత్రి ఉద్యోగికి మృతి కారణం ఆసుపత్రి యాజమాన్యం వేధింపులేనని మృతుని బంధువులు ఆసుపత్రి ముందు ధర్నాకు దిగారు. మృతుడి భార్య మానస తెలిపిన వివరాల ప్రకారం బొంగరాలబీడు నిరుపేదల కాలనీ 1వలైనులో నివశించే వంగల మహేష్ (32) అరండల్‌పేటలోని ఓ ఆసుపత్రిలో ఫార్మాసీ విభాగంలో బిల్లులు, అకౌంట్స్ గుమస్తాగా మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఆసుపత్రి నిర్వాహకులు రెండు నెలల క్రితం బిల్లుల్లో అవకతవకలు జరిగాయంటూ మహేష్‌ను ఉద్యోగం నుంచి తీసివేశారు. అయితే అకౌంట్స్ మొత్తం సరిచేయాలంటూ తరచూ ఆసుపత్రికి పిలుస్తున్నారు. ఈ క్రమంలో మహేష్ గురువారం ఆసుపత్రికి వచ్చి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం పక్షవాతంతో ఇంట్లో పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతనిని తొలుత నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి అనంతరం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

ఆసుపత్రి యాజమాన్యం వేధింపుల కారణంగానే మహేష్ తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. మృతదేహాన్ని ఆసుపత్రి వద్దకు తీసుకొచ్చి సెల్లార్‌లో ఉంచారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు ధర్నాకు దిగారు. అరండల్‌పేట ఎస్‌హెచ్ఓ రామా నాయక్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఒప్పుకోలేదు.

రామరాజ్యాన్ని తలపిస్తున్న జగనన్న పాలన

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



రాజన్న చిత్రపటాన్ని చూపుతున్న కోటేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే గిరిధర్

గుంటూరు వెస్ట్: రామరాజ్యాన్ని తలపించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు మద్దాళి గిరిధర్ తెలిపారు. సోమవారం 38వ డివిజన్ ఇన్‌చార్జ్ బోగిసం శిరీష, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలవడమే కాకుండా కులమతాలకు అతీతంగా పరిపాలన కొసాగిస్తుండడంతో ఇతర రాష్ట్రాలు కూడా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. పేదల అభ్యున్నతి కోసం నవరత్న సంక్షేమ పథకాల అమలు అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే దాదాపు 90 శాతం పైగా వాగ్దానాలను నెరవేర్చామన్నారు. ముఖ్యంగా చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యనందించేందుకు పాఠశాలల ఆధునీకరణ, అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల అమలు ద్వారా పేదల జీవన ప్రమాణాలు వృద్ధి చెందుతున్నాయన్నారు. రాష్ట్రంలో 80 శాతానికి పైగా ప్రజలు ఆర్థికంగా ఎదగాలనే దృఢ సంకల్పాన్ని ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ఆపలేరని చెప్పారు. ఎమ్మెల్యే గిరిధర్‌తోపాటు 38వ డివిజన్ ఇన్‌చార్జ్ బోగిసం శిరీష, ప్రసాద్‌లు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎం.కోటేశ్వరరావు కుటుంబం మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి తమకు చేసిన సహాయానికి కృతజ్ఞతగా ఆయన చిత్రపటాన్ని ఎమ్మెల్యే కు చూపించి అభిమానాన్ని చాటుకున్నారు. బుర్రి రాంబాబు, ఎడ్లూరి సాంబశివరావు, చౌటుపల్లి కుమార్, షేక్ షరీఫ్, ఎడ్లూరి శ్రీకాంత్, కవిత, కార్యకర్తలు పాల్గొన్నారు.

9,10 తేదీలలో చెస్ పోటీలు

చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9,10వ తేదీలలో నాగార్జున యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి సోమవారం తెలిపారు. యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి.జాన్సన్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన డిగ్రీ కళాశాలల నుంచి 100కు పైగా జట్లు పాల్గొంటాయని తెలిపారు. యూనివర్శిటీ చెస్ టీంను కూడా ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థుల ర్యాలీ

కళాశాల ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఆదేశాల ప్రకారం చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి అక్కడ ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాలలో ఉన్న కోర్సులు, సదుపాయలు, ల్యాబ్స్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల గురించి వివరించి సీనియర్ ఇంటర్ విద్యార్థులు స్థానిక డిగ్రీ కళాశాలలో చేరాలని సూచించారు.

GENERAL NOTICE

IN THE COURT OF THE PRL. DIST. JUDGE, GUNTUR

H.M.G.O.P. No. 1408 / 2022

Between:-

Nandam Mary Neelima, W/o. Late Karta Basava Rao, R/o. D.No.16-7-15/9, N.D. Baig Street, Purnanandampet, Gandhinagaram Vijayawada Urban. ..Petitioner

and

Nil ..Respondant

[illegible]

Schedule: Guntur Dt. & R.D., GMC Area, Guntur City, Mallikarjunapet, 3rd Line, Guntur D.No.172/1 an extent of Ac. 0.62 cents, D.No.188/2 an extent of Ac. 5.02 cents and D.No.188/2 an extent of Ac. 4.05 cents within the above survey Numbers out of which an extent of 157.2 Sq. yds site and building door No.7-17-344 RPC G-1 house being bounded by East: Chavali Krishnamurthy House, 37ft. South: Municipal road, 13.06ft. West: Municipal road, 32ft. North: Mahankali Gandhi's Property, 46ft.

K. GOPINATH, N. SRINIVASA RAO, G. HUSSAIN, Advocates for Petitioner, Guntur. Cell: 9440016125, 9440441499